# తెర తీయనంతవరకే . . .

అలా పరిగెడుతూనే ఉంటాం
ఎందర్నో విడిచి అంతంత దూరం
అలుపు తీరేందుకు ఆగినా అసంతృప్తే!
వెనక్కి లాగుతున్న దిగుళ్లని దాటుకుంటూ
మళ్లీ పరుగు

ఈలోగా ఎప్పుడో
ఒక్క ఆదేశం లాంటి పిలుపుతో
అంధకారంలో ఫ్లాష్‌ఫోటోలు తీస్తున్న
మెరుపుల్లా ఆలోచనలు
వెంట వెంటనే ఉరుముతూ భయాలు
పూర్వాపరాల్ని తవ్వుకుంటున్న కొద్దీ
బయల్పడే అనుమానాల దిగుళ్ళు
అన్నీ ఒకేసారి మూకుమ్మడిగా–

అంతవరకూ
సునాయాసంగా నడిచొచ్చిన దారిలోనే
ఇప్పుడు ఒక అర్ధరాత్రి ఏకాకిగా
అడవిని దాటుకుంటూ
అనంతంలోకి పోతున్నట్టు . .
శరీరాన్ని ముక్కలు ముక్కలు చేసి
ఎన్ని దిక్కులకి విసిరేసినా
సవాలక్ష సంకోచాలతో తిరిగొస్తాయి

ఎవరి ఆలోచనల్లో కలల్లో వారు
అయినా అందరితోనూ ప్రయాణం

సాగుతూనే ఉంటుంది

భళ్లున తెల్లవారనంత వరకే చీకటి
తెర తీయనంత వరకే రహస్యం!